

కూటమి సంబరాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి గురువారం నాటికి ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా అన్ని మండలాలు, పట్టణాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, అయినప్పటికీ కూటమి ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని నాయకులు చెప్పారు.

జీవనంలో యోగా భాగం కావాలి

» హోం మంత్రి వంగలపూడి అనిత



యోగా చేస్తున్న మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు సుందరపు విజయ్‌కుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్ విజయకృష్ణన్ - 8లో



నక్కపల్లిలో సంబరాలు జరుపుకుంటున్న కూటమి నాయకులు

తల్లికి వందనం ప్రారంభం

రెండు నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ రెండో ఏడాది విద్యార్థుల జాబితాలు సిద్ధం

» జిల్లాలో 1,79,272 మంది అర్హులు
» ఒక్కో విద్యార్థికి రూ.13 వేల చొప్పున సాయం
» ఒకటి, రెండు రోజుల్లో 1,19,357 మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ
» ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల తరువాత దరఖాస్తుల స్వీకరణ
» అనంతరం అర్హుల జాబితా ప్రకటన

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వున్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా 'తల్లికి వందనం' పథకం శ్రీకారం చుట్టింది. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల్లో అర్హుల జాబితాలను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం జాబితాలను తయారుచేయాల్సి వుంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో చదువుతున్న సుమారు లక్షా 80 వేల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం అమలయ్యే అవకాశం వుందని అధికారులు చెబుతున్నారు.

కుటుంబంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంత మందికి ఏటా రూ.15 వేల చొప్పున 'తల్లికి వందనం' పథకం కింద అందజేస్తామని కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. గత ఏడాది పాఠశాలలు తెరవడం, అప్పుడే కూటమి అధికారంలోకి రావడంతో ఈ పథకాన్ని అమలు చేయడానికి వీలుకాని పరిస్థితి ఏర్పడింది. దీంతో 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. పాఠశాలలు పునఃప్రారంభమైన రోజున 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ... మిగతా 8వ పేజీలో



నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి)లో పంపిణీ చేసిన పుస్తకాలతో విద్యార్థులు.

ఫార్మాలో ప్రమాదాల పరంపర

కంపెనీలలో అసలేం జరుగుతోంది?

» తాజాగా 'సాయిశ్రేయాస్'లో ఇద్దరి మృతి
» మరొకరి పరిస్థితి విషమం

» సేఫ్టీ అధికారులే మరణిస్తే... సిబ్బంది పరిస్థితి ఏంటి?
» ఎస్‌ఓపీ పాటించేలా చూడాల్సిన బాధ్యత ఎవరిది?
» వరుస ప్రమాదాలు జరుగుతున్నా అదే నిర్లక్ష్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు, మరణాలకు అంతుండడం లేదు. భద్రతా ప్రమాణాలు ఎవరూ పాటించడం లేదు. అమలు చేయాల్సిన విభాగాలు చోద్యం చూస్తున్నాయి. తాజాగా సాయిశ్రేయాస్ ఫార్మా కంపెనీలో ఏకంగా మందుల తయారీ ప్రక్రియను పర్యవేక్షించే భద్రతా విభాగం అధికారులే ప్రాణాలు కోల్పోయారంటే అక్కడి పరిస్థితులు ఏమిటో ఆలోచించాల్సి ఉంది.

పరవాడలోని విశాఖ ఫార్మా సిటీ (రాంకీ)లోని సాయిశ్రేయాస్ మందుల తయారీ కంపెనీలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత విషవాయువు పీల్చి ఇద్దరు ఉద్యోగులు మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. చనిపోయిన వారిలో పగిరి చంద్రశేఖర్ (32) సేఫ్టీ విభాగంలో అసిస్టెంట్ మేనేజర్ కాగా మరొకరు శరగడం కుమార్ (25) సేఫ్టీ షిఫ్ట్ ఆఫీసర్. అంటే ఇద్దరూ భద్రతా విభాగంలో కీలక ఉద్యోగులే. వారే మరణించారంటే...అక్కడ ఏమి జరిగినట్టు..? భద్రతా ప్రమాణాలు ఎంత వరకు పాటిస్తున్నట్టు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏమి జరిగిందంటే...?

కీలకమైన వ్యాధికి సంబంధించిన ఇంటర్మీడియట్ మందు తయారుచేస్తుండగా ఆ బ్యాచ్ ఫెయిల్ అయింది. అది ప్రమాదకరమైన వ్యర్థం కావడం వల్ల ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఈటీపీ)లోకి పంపకుండా వేరే ట్యాంక్‌లోకి గానీ రియాక్టర్‌లోకి గానీ తీసి, దానిని ట్రీట్‌మెంట్ చేసి ... మిగతా 8వ పేజీలో



ప్రమాదం జరిగిన ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటును పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు

బడి భోజనం మెనూలో స్వల్ప మార్పులు

» ముతక బియ్యం స్థానంలో సన్న బియ్యం సరఫరా

» సాంబార్ బాత్‌కు బదులు వైట్ రైస్, సాంబారు
» హాట్ పొంగలి/ కూరగాయల పులావ్ స్థానంలో వైట్ రైస్, ఆకుకూర పప్పు
» పులిహోర... మంగళవారం నుంచి శుక్రవారానికి మార్పు

నర్సీపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూలో ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. గత విద్యా సంవత్సరం భోజన పథకం మెనూలో కొన్ని మార్పులు చేసి తాజాగా మెనూ చార్ట్ సిద్ధం చేసి పాఠశాలలకు పంపించింది. వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు తెరవక ముందే ముతక బియ్యం స్థానంలో సన్న బియ్యం సరఫరా చేసింది. ప్రతి గురువారం విద్యార్థులకు సాంబార్ బాత్ పెట్టేవారు. ఎక్కువ మంది దీనిని తినే వారు కాదు. ఉపాధ్యాయుల నుంచి నివేదిక తెప్పించుకొని సాంబార్ బాత్‌ను మెనూ నుంచి తొలగించి దాని స్థానంలో వైట్ రైస్, సాంబారు చేర్చారు. ప్రతి సోమవారం హాట్ పొంగలి లేదా కూరగాయల పులావ్ పెట్టేవారు. కొత్త మెనులో సాధారణ వైట్ రైస్, ఆకుకూర పప్పు చేర్చారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో వారంలో ఐదు రోజులు కోడిగుడ్డు, మూడు రోజులు వేరుశనగ చిక్కిలు, మూడు రోజులు రాగి జావ కొనసాగిస్తున్నారు. ప్రతి మంగళవారం పెట్టే పులిహోరను శుక్రవారానికి మార్చారు.



నర్సీపట్నం తురకబడి పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

కొత్త మెనూ...

- **సోమవారం:** వైట్ రైస్, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కి
- **మంగళవారం:** వైట్ రైస్, గుడ్డు కూర, రసం, రాగి జావ
- **బుధవారం:** కూరగాయల పులావ్, బంగాళా దుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కి
- **గురువారం:** వైట్ రైస్, సాంబారు, గుడ్డు కూర, రాగిజావ
- **శుక్రవారం:** పులిహోరా, చట్నీ (గోంగూర, విజిటేబుల్), ఉడికించిన గుడ్డు, చిక్కి
- **శనివారం:** వైట్ రైస్, విజిటబుల్ కర్రీ, రసం, రాగిజావ, స్వీట్ పొంగలి

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాల్లో 75.89 శాతం ఉత్తీర్ణత

» 1,311 మంది బాలురు, 810 మంది బాలికలు పాస్

అనకాపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. మే 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 2,795 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 2,121 మంది (75.89 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 1,766 మంది బాలురు పరీక్షలు రాయగా 1,311 మంది (74.24 శాతం), 1,029 మంది బాలికలు పరీక్షలు రాయగా 810 మంది (78.72 శాతం) పాసయ్యారు. ఉత్తీర్ణులు కాని విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు.

గోవాడ షుగర్స్ ఎండీగా వెంకటేశ్వరరావు

» భీమసింగికి సన్యాసినాయుడు బదిలీ

చోడవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఎండీగా జి.వెం కటేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. ఇతను ... మిగతా 8వ పేజీలో



వెంకటేశ్వరరావు

పోలీసుల అదుపులో బియ్యం లారీలు



రాజానగరం నుంచి విశాఖకు రవాణా

» ఎలమంచిలి వద్ద యర్రవరంలో ఆగడంతో పోలీసులకు సమాచారం
» సిబ్బందితో వెళ్లి పరిశీలించిన ఎస్‌ఐ
» పౌరసరఫరాల శాఖకు వర్తమానం
» డీటీ వచ్చి బియ్యం శాంపిళ్లు సేకరణ
» పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలింపు
» నివేదికనుబట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడి



లారీలో నుంచి బియ్యం శాంపిళ్లు తీయిస్తున్న పౌరసరఫరాల శాఖ డీటీ సోమశేఖర్ (ఇన్‌సెట్‌లో) రెండు లారీల్లో నుంచి సేకరించిన బియ్యం శాంపిళ్లు

ఎలమంచిలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): **తూర్పు గోదావరి జిల్లా నుంచి విశాఖపట్నానికి రవాణా అవుతున్న రెండు బియ్యం లారీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు వచ్చి బియ్యం నమూనాలను సేకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ల్యాబ్‌కు పంపుతామని, వచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు వుంటాయని అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.**

ఎలమంచిలి పట్టణ పరిధిలోని యర్రవరం సమీపంలోని పెట్రోలు బంకు వద్ద బియ్యం లోడుతో ఉన్న రెండు లారీలు వున్నట్టు గురువారం ఉదయం పట్టణ పోలీసులకు సమాచారం వచ్చింది. పట్టణ ఎస్‌ఐ సావిత్రి, సిబ్బందితో అక్కడకు వెళ్లి లారీలను తనిఖీ చేశారు. డ్రైవర్ల వద్ద వున్న వే బిల్లులను పరిశీలించగా తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నుంచి విశాఖ నగరానికి రవాణా చేస్తున్నట్టుగా వుంది. ఒక్కో లారీలో సుమారు 15 టన్నుల బియ్యం వున్నాయి. అయితే ఇవి రేషన్ బియ్యమా? లేకపోతే సాధారణ బియ్యమా? అన్న అనుమానం రావడంతో పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సాయంత్రం ఎలమంచిలి ... మిగతా 8వ పేజీలో

ప్రధాని మోదీ సారథ్యంలో దేశానికి మరింత గుర్తింపు

» జీడీపీలో మూడో స్థానంలోకి తీసుకెళ్లడమే లక్ష్యం
» వికసిత్ భారత్‌తో అన్ని రంగాల్లో అభివృద్ధి
» అమరావతిని నాశనం చేసిన జగన్‌కు జనం బుద్ధి చెప్పారు
» అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, దేశానికి ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు తేవాలన్నదే ధ్యేయమని పార్లమెంటు రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్‌డీఏ పాలన 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇక్కడ బీజేపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2014లో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చినప్పుడు దేశం పలు రంగాల్లో వెనుకబడి వుందన్నారు. తరువాత ప్రధాని మోదీ నాయకత్వంలో వివిధ రంగాల్లో అభివృద్ధి పరుగులు తీసిందన్నారు. జీడీపీలో భారత్‌ను నాలుగో స్థానానికి చేర్చారని, మూడు స్థానంలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఒక విజన్‌తో ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. కొత్త జాతీయ రహదారుల నిర్మాణం, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్‌ల ఆధునికీకరణ పనులు ... మిగతా 8వ పేజీలో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్. పక్కన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యామిని

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన రద్దు



విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నగర పర్యటన రద్దయ్యింది. అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం నేపథ్యంలో సీఎం తన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకున్నారు. ఆయన శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో జరిగే రెన్యువబుల్ ఎనర్జీ దక్షిణ భారత సదస్సుకు హాజరు కావలసి ఉంది. అలాగే సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన 'ది డెక్' భవనాన్ని, ఆ భవనం ఐదో అంతస్థులో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించాల్సి ఉంది. ఆ తరువాత వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే సమావేశంలో పాల్గొని, పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి చర్చించాల్సి ఉంది. ఇవన్నీ రద్దయ్యాయి.

విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యంతో భోజనం

» కలెక్టర్ విజయకృష్ణన్ - 8లో

భోజనం బాగుంది

» ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో వండి వడ్డించిన నిర్వాహకులు

» అన్నంతో పాటు వంటకాలు కూడా రుచికరంగా ఉన్నాయని విద్యార్థుల ఆనందం


ఎలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు స్కూల్‌లో ఆనందంగా భుజిస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థుల హాజరు సంఖ్య అంతంత మాత్రంగానే కనిపించింది. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్న బియ్యంతో వండి వడ్డించడంతో విద్యార్థులంతా ఆహారం చాలా రుచికరంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం పెడతామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం విద్యా సంవత్సరం ఆరంభం రోజున అవే బియ్యంతో పాటు తాజా సరకులతో వంట చేసి వడ్డించడంతో అంతా ఇష్టంగా భుజించారు. సన్నబియ్యం వండి వడ్డిస్తున్నందున విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎలమంచిలి మండలంలోని 42 ప్రభుత్వ పాఠశాలలకు నెల రోజులు సరిపడా సన్నబియ్యాన్ని సరఫరా చేశారు. ఇక్కడి రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి పరిశీలించగా అక్కడ విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని ఇష్టంగా భుజించడం కనిపించింది. దీనిపై వారు మాట్లాడుతూ గతంలో అన్నం ముద్దగా ఉండేదని, ఇప్పుడు సన్న బియ్యం కావడంతో అన్నం చక్కగా ఉండడంతో పాటు వంటలు కూడా రుచికరంగా ఉన్నాయని ఉపాధ్యాయులు సైతం పిల్లలకు చక్కని ఆహారం అందుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పాఠశాలలకు వచ్చే బియ్యం బస్తాల తూకంలో ఎటువంటి తేడాలు లేవని చెపుతున్నారు. ఇదిలా వుంటే, తొలిరోజు విద్యార్థులు అంతంత మాత్రంగానే పాఠశాలలకు విచ్చేశారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆరు వందల మంది విద్యార్థినులకు వంద మంది లోపే, రైల్వే స్టేషన్ రోడ్డు ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకు ఇరవై మంది లోపే హాజరైనట్లు తెలిసింది. మండల వ్యాప్తంగా 40 శాతం మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలకు విచ్చేశారు.

బాల కార్మికులతో పనిచేయించడం నేరం

» ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్పందన


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి స్పందన

ఎలమంచిలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని లైనుకొత్తూరు సమీపంలో గల ఫ్యూజన్ ఇటుకల పరిశ్రమ ఆవరణలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలమంచిలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్పందన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బాల కార్మికులతో పని చేయించడం నేరమన్నారు. వారిని పాఠశాలలకు పంపి, విద్యావంతులు తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం బాలకార్మిక చట్టాలపై అవగాహ కల్పించారు. ఈ సదస్సులో కార్మిక శాఖాధికారి బాలకృష్ణ, పరిశ్రమ ఎండీ కేవీ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, కార్యదర్శి ఎల్.వి.రామకృష్ణ, ఏజీపీ డి.వెంకట్రావు, న్యాయవాదులు బి.హరిశంకరరావు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ పి.ప్రసాదరావు అన్నారు. క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఇక్కడి పోలీసు స్టేషన్ ఆవరణలో బాలకార్మిక వ్యతిరేక మాసోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బాలకార్మికులను బాగా చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బి.శివనాయుడు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, ఎ.ఆర్.వి.సత్యనారాయణ, గోవింద, సంస్థ కార్యదర్శి మళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'ల్లో సామూహిక అక్షరాభ్యాసం


మునగపాక అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

మునగపాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని గురువారం పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం మునగపాక ఎంపీపీ స్కూల్ ఆవరణలో ఉన్న కేంద్రంతో పాటు పలుచోట్ల ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె.అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయిని కేవీ రమణమ్మ పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. అదే విధంగా చూచుకొండ, గణపర్తి, మంగవరపుపేట తదితర గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాలు జరిగాయి. సర్పంచ్ చదరం గణేష్‌నాయుడు, కూటమి నాయకులు కర్రి రామనాగేశ్వరరావు, దాడి శివ, చంద్రమోహన్, ఎం.వి.రమణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రుక్మిణీపురం అంగన్‌వాడీ కేంద్రంలో...

ఎలమంచిలి : మండలంలోని రుక్మిణిపురం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కె.సత్తిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసినిల సమక్షంలో మూడు సంవత్సరాలు దాటిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు విద్య పట్ల మక్కువ పెరుగుతుందని సర్పంచ్ అన్నారు. స్థానిక ఉపాధ్యాయుడు కృష్ణారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు చిట్టెమ్మ, రమాదేవి, కుమారి, మహిళా పోలీసు, ఆశ కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల పండుగలు


మరిడి మహాలక్ష్మికి గరగలు సమర్పిస్తున్న భక్తులు


మునగపాకలో పూజలు అందుకున్న కొత్తమహాలక్ష్మి

అచ్యుతాపురం/ మునగపాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో అమ్మవార్ల పండుగలు గురువారం అత్యంత వైభవోపేతంగా జరిగాయి. అచ్యుతాపురం మండలం ఉప్పవరంలో మరిడిమహాలక్ష్మి పండుగ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. మల్లవరం, నరేంద్రపురం, ఉప్పవరం, ఎర్రవరం తదితర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. వివిధ రకాల పిండి వంటలను ఊరేగింపుగా మహిళలు ఆలయానికి తీసుకు వచ్చి అమ్మవారికి సారెగా సమర్పించారు. అలాగే, మునగపాక మండలంలోని పలు గ్రామాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. మునగపాకలోని కొత్త మహాలక్ష్మి అమ్మవారిని సర్పంచ్ దిమ్మల అప్పా రావుతో పాటు కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, ఆడారి గణేష్, కమిటీ పెద్దలు దర్శించుకున్నారు.

నేడు పదహారు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పదహారు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్, అచ్యుతాపురం ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మార్టూరు రోడ్డు, దిబ్బపాలెం, భోగాపురం రోడ్డు, అచ్యుతాపురం, మోసయ్యపేట బర్మా కాలనీ, చోడపల్లి, రామన్నపాలెం, మోసయ్యపేట, వెంకటాపురం జంక్షన్, కొత్తూరు మోసయ్యపేట, ఇందిరమ్మ కాలనీలకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

ముగిసిన రామాయణ ప్రవచనాలు

మునగపాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వాడ్రాపల్లి గ్రామంలోని పెదరామాలయం ఆవరణలో నెల రోజుల పాటు జరిగిన రామాయణం ప్రవచనాల కార్యక్రమం గురువారంతో ముగిసింది. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధి బుద్ధ నరసింహమూర్తి వాల్మీకి రచించిన రామాయణం గురించి బోధించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామ పెద్ద పెతకంశెట్టి రామజోగినాయుడు ఆధ్వర్యంలో సత్కరించారు. గ్రామ పెద్దలు మళ్ల రమణమ్మ, మళ్ల వరహానరసింగరావు, కొయిలాడ దశావతారం, పి.సత్యనారాయణ, శేషు, అప్పలనాయుడు, కన్నుంనాయుడు, శివరామకృష్ణ మాధవి తదితరులు పాల్గొన్నారు.


పాయకరావుపేటలో కేక్ కట్‌చేస్తున్న కూటమి నాయకులు


కోటవురట్లలో..

కూటమి ఏడాది పాలనపై సంబరాలు

పాయకరావుపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు చించెలపు ప్రదీప్, యాళ్ల వరహాలబాబు తదితరులు కేక్ కట్‌చేసి అందరికీ పంపిణీచేశారు. ఈ సందర్భంగా చించెలపు ప్రదీప్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గం ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెంది ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆచంట దొరతోపాటు నాయకులు బొంది కాశీవిశ్వనాథం, చింతకాయల రాంబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, మలిపెద్ది వెంకటరమణ, సూరా సుబ్రహ్మణ్యం, లెక్కల గోవిందు, దొరబాబు, పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లిలో నాయకులు ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కేక్ కట్ చేశారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్లు కొప్పిశెట్టి కొండబాబు, పెంకులరాజు, కొప్పిశెట్టి బుజ్జి, పాయకరావుపేట ఏఎంసీ చైర్మన్ దేవర సత్యనారాయణ ,టీడీపీ మండ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, కూటమి నాయకులు వైబోయిన రమణ, కోసూరి శ్రీను, వెలగా సుధాకర్, మీగడ సత్తిబాబు, నానేపల్లి రాఘవులు, పాల్గొన్నారు.

ఎస్. రాయవరం: స్థానిక జంక్షన్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు అబద్దం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు అబద్దంను ఘనంగా సన్మానించారు. నాయకులు కందుల వెంకటేశ్వరరావు, తుంపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, సుంకర శ్రీనివాసరావు, పడమర సతీశ్, ముప్పిన శ్రీనివాసరావు, కోడ లోవరాజు, పోలిశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

కోటవురట్ల: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. జల్లూరులో గురువారం టీడీపీ నాయకులు నిర్వహించిన ఏడాది పాలన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు లింగం నాయుడు, సీనియర్ నాయకులు జానకి శ్రీనివసరావు, జనార్దన్ తిరుమలరావు, బాబ్జి, ఎండపల్లి చంటి, జనసేన మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.


ఎస్. రాయవరంలో ఏడాది పాలన వేడుకలు

పాఠశాలలు పునఃప్రారంభం


వేంపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు చాక్లెట్లతో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఉదయం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మండలంలో 6095 మంది విద్యార్థులుండగా తొలి రోజు 3172 మంది పిల్లలు (49శాతం) హాజరైనట్టు ఎంఈవో కె.నరేశ్ చెప్పారు. వేంపాడు హైస్కూల్‌లో ఉపాధ్యాయులు పాఠశాల ప్రహరీ వద్ద విద్యార్థులకు స్వాగతం పలుకుతూ చాక్లెట్లు పంపిణీ చేశారు. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం తయారు చేశారు. వేంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శ్రీవిద్య, పెద్దలు మణిరాజు, అప్పలరాజు సూపర్‌వైజర్లు లలిత, సత్యవతి పాల్గొన్నారు.

సాగులోని భూములను ఆన్‌లైన్ చేయాలి

పాయకరావుపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కుమారపురం రెవెన్యూ పరిధిలో తమ సాగులో ఉన్న భూ ములను ఆన్‌లైన్‌లో నమోదుచేసి పట్టాలు మంజూరు చేయాలని పలువురు రైతులు కోరారు. గురువారం ఈ మేరకు తహశీల్దార్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా నీలాపు దుర్గాలబ్బాయిరెడ్డి, పెంటయ్యరెడ్డి, బాపనయ్యరెడ్డి మాట్లాడుతూ తాము 1969 నుంచి గ్రామ రెవెన్యూ సర్వే నంబర్లు 231, 235, 236, 237, 238, 239లల్లో భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పటికీ ఈ భూములను అధికారులు వెబ్‌ల్యాండ్‌లో పొందుపర్చలేదని వా పోయారు. నమోదుచేసి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీలాపు కొండయ్యరెడ్డి, రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్.రెడ్డి, నరసింహారెడ్డి, యన్నంరెడ్డి నూకమణి, నీలాపు అప్పారావు రెడ్డి, దిగుమర్తి సన్యాసిరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్. రాయవరం: మండలంలోని కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధి నిర్వహణపనుల చేపడుతున్నందున వమ్మవరం, కొరుప్రోలు, గెడ్డపాలెం గ్రామాల్లో ని ఏజీఎల్ సర్వీసులకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల రైతులు సహకరించాలని కోరారు.

గ్రావెల్ తవ్వకాల పరిశీలన

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


కొత్తపోలవరం కొండపై గ్రావెల్ తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎస్. రాయవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపోలవరం కొండపై గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని గురువారం తహశీల్దార్ జె. రమేశ్ బాబు పరిశీలించారు. ఎక్సకవేటర్‌తో కొండపై గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టడంతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'కొత్తపోలవరంలో గ్రావెల్ దందా' శీర్షిక వచ్చిన కథనానికి తహసీల్దార్ స్పందించారు. కొండపై ప్రదేశానికి సిబ్బందితో వెళ్లి అక్కడ తవ్వకాలు జరిగినట్టు గుర్తించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ తవ్వకాలు చేపట్టిన వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ పట్టివేత

నక్కపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురంలో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్టు సీఐ కె.కుమారస్వామి చెప్పారు. ఆ గ్రామ పరిధిలో ఏపీఐఐసీ భూముల నుంచి గ్రావెల్‌ను తవ్వి, ట్రాక్టర్‌లో వేంపాడు తరలిస్తుండగా, తమ సిబ్బందితో పట్టుకుని సీజ్ చేశామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నక్కపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకట్‌నగర్ కాలనీలో గురువారం సంపత్ వినాయక ఆలయ సప్తమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా వేదపండితుడు పండుశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం చేశారు. పలు పార్టీల నాయకులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. సామాజిక సేవా కార్యకర్త ఎన్ఎన్ శర్మను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

కొత్త వరి వంగడాలతో అధిక దిగుబడులు

కోటవురట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వరిలో కొత్త రకాలు వంగడాల సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త మధుసూదనరావు తెలిపారు. గురువారం మండలంలో కొడవటిపూడి, టి.జగ్గంపేట గ్రామాల్లో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్య పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త యు.శ్రీధర్, బీసీటీ కృషి విజ్ఞాన్ శాస్త్రవేత్త వి.ప్రసాద్, ఏఓ బి.సరోజినితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ వ్యవసాయ సహాయకుడు అప్పలనాయుడుతోపాటు రైతు లు పాల్గొన్నారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న జగదీశ్

కూటమి ఏడాది వేడుక

▸▸ కేక్‌లు కట్‌చేసి సంబరాలు ▸▸ కోలాహలంగా కార్యాలయాలు



సబ్బవరంలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ

అనకాపల్లి/అనకాపల్లి టౌన్ జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ఏడాది పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించిందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వ వన్ ఇయర్ వేడుకలను ఇక్కడి టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనం తరం కేక్ కట్‌చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే 70 శాతం హామీలు అమలు చేసిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తోందన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు కె.సత్యనారాయణ, బి.వెంకటరావు, కె.జగన్, గణేశ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, గవరపాలెంలోని టీడీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వ వన్ ఇయర్ వేడుకలను రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్‌చేశారు. ఏడాది పాలనలో ప్రగతిని వివరించారు. టీడీపీ నాయకులు పచ్చికూర రాము, కర్రి బాబి, మాదంశెట్టి నీలబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, లక్ష్మీనారాయణనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కేక్‌కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎన్నో అవకతవకలు జరిగాయన్నారు. భూదందాలు, లిక్కర్ మాఫియా వంటివి చోటు చేసుకున్నాయని ఆరోపించారు. కూటమి అధి కారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రం అభి వృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. పార్టీ నాయకులు బొడ్డపాటి చిన రాజారావు, బొడ్డేడ శంకరరావు, వేగి దొరబాబు, దాడి ఈశ్వరరావు, పొలిమేర శివ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి లేదని పసలేని ఆరోపణలు చేస్తున్న వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి దమ్ముంటే ఒకే వేదిక పైకి చర్చకు సిద్ధమా అని టీడీపీ పెందుర్తి నియోజవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ సవాల్ విసిరారు. కూటమి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా సబ్బవరం కూడలి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జరిగిన సంబరాల్లో ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం వైసీపీ పాలన తీరును ఎండగట్టడంతో పాటు కూటమి ప్రజారంజక పాలన అందిస్తుందని వివరించారు. మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, బలిరెడ్డి అప్పారావు, గండి వంశీదీప్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడలో ఘనంగా దుర్గమాంబ పండుగ



పరవాడ, జూన్12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో దుర్గమాంబ పండుగ గురువారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఆలయ ధర్మకర్త పైలా పోతునాయుడు, స్థానిక నాయకులు రెడ్డి శ్రీను, పైలా హరీష్, శిరపురపు అయ్యబాబు, గండి నమో బాబు దర్శించుకున్నారు.

జనసేన మండల ప్రధాన కార్యదర్శిగా నరసింగరావు



లంకెలపాలెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జనసేన పరవాడ మండల ప్రధాన కార్యదర్శిగా పెదముషివాడ పంచాయతీ గండివానిపాలెం గ్రామానికి చెందిన కరణం నరసింగరావు నియామకమయ్యారు. ఈ మేరకు అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకముంచి పదవి కట్టబెట్టినందుకు పార్టీ అధినేత పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే రమేశ్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే 'పంచకర్ల' జన్మదిన వేడుకలు



పరవాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జన్మదిన వేడుకలను శుక్రవారం ఉదయం పదకొండు గంటలకు ఇక్కడి మరిడిమాంబ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసకాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేపడతామన్నారు. ఈ వేడుకలకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాల్సిందిగా ఆయన కోరారు.

'2047 నాటికి ప్రపంచ అగ్రగామిగా భారత్'

కొత్తూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : భారతదేశాన్ని 2047 నాటికి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలపాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ అన్నారు. గురువారం ఇక్కడ ఏర్పాటైన జిల్లాస్థాయి వృత్తినిపుణుల సమావేశంలో మాట్లాడారు. వికసిత భారత్‌లో భాగంగా మోదీ పదకొండేళ్ల సుపరిపాలనలో విజయాలను వివరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నాయకులు బీవీఎస్ వర్మ, కర్రి చిట్టిబాబు, రవిరాజు, పట్టాభి ప్రసాద్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

15న యోగాపై అవగాహనకు బైక్ ర్యాలీ

అనకాపల్లి టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రలో భాగంగా ఈనెల 15వ తేదీన అనకాపల్లిలో ఐదు వేల మందితో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు జిల్లా పతంజలి యోగా సమితి అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు, భారత స్వాభిమాన్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి మంగియ్య తెలిపారు. గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని అన్నివర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎస్ అప్పారావు, వి.సంతోష్ గోవర్ధని, టి.మల్లేశ్వరరావు, దాడి బుజ్జి, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సందడిగా సామూహిక అక్షరాభ్యాసాలు

కొత్తూరు/తుమ్మపాల/కశింకోట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంవత్సరం ఆరంభం సందర్భంగా గురువారం పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు సందడిగా జరిగాయి. కొత్తూరు పంచాయతీ రామాపురం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ హెచ్‌ఎం పెనుమత్స కృష్ణంరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. తుమ్మపాల అంగన్‌వాడీ కేంద్రం-5లో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి వెంకట సన్యాసినాయుడు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. కశింకోట మండలం సత్తెమ్మ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమా నికి విశ్రాంత ఎంఈవో నంబా రమణ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలకు వినతి

అనకాపల్లి టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు గురువారం డీఈవో కార్యాలయ అధికారిణి పార్వతికి వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు వసూలు, విద్యా చట్టాన్ని ఉల్లంఘించి పుస్తకాలు, యూనిఫారాలు విక్రయించడం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధి మణికంఠ పాల్గొన్నారు.



పాడేరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలువేస్తున్న గిడ్డి ఈశ్వరి, టీడీపీ నాయకులు



జి.మాడుగుల: మాట్లాడుతున్న మాజీ మంత్రి మణికుమారి, పక్కన ట్రైకర్ డైరెక్టర్ కృష్ణారావు

చిత్తశుద్ధితో హామీలు అమలు

- సూపర్ సిక్స్‌లో భాగంగా 'తల్లికివందనం' జమ..
- టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి
- కూటమి ఏడాది పాలన సంబరాలు

పాడేరురూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మేరకు తల్లికి వందనం పథకం కింద విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నగదు జమ చేస్తోందని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన పూర్తయిన సందర్భంగా గురువారం కూటమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈశ్వరి స్వగృహం కుమ్మరిపుట్టులో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి సహకరిస్తున్న రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆలోచనలకు తగ్గట్టుగా ప్రభుత్వం ముందుకు నడుస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేల చొప్పున అందించనుందన్నారు. త్వరలోనే నిరుద్యోగ భృతి అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం.. ఇలా సూపర్-6లో ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. జగన్ విధ్వంసపాలన సరిచేస్తూ రావడానికి ఏడాది సమయం పట్టిందన్నారు. ఈ ఏడాదిలో గిరిజనుల ప్రగతి కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేసిందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గిరిజన ప్రాంతంలో పర్యటించి డోలీమోతలు ఉన్న ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకొని అభివృద్ధి పనులు ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంపీఎస్ ప్రసాద్, రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, నాయకులు చల్లంగి లక్ష్మణరావు, సీహెచ్.జ్ఞానేశ్వరి, డప్పోడి వెంకటరమణ, పాడేరు వైస్ఎంపీపీ జి.శివకుమార్, రొబ్బి రాము, ఎ.సుబ్బలక్ష్మి, డిప్పల వెంకటకుమారి, నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

గిరిజన అభివృద్ధికి పెద్దపీట: మాజీ మంత్రి మణికుమారి

జి.మాడుగుల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి చేరువ అవుతోందని మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి స్పష్టం చేశారు. ఏపీ ట్రైకర్ డైరెక్టర్ కూడ కృష్ణారావు, ఎంపీపీ అప్పలరాజుతో కలిసి సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలను అనుగుణంగా నిత్యం ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా కృష్ణారావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎంపీపీ అప్పలరాజు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, కె.ఉమమహేశ్వరరావు, కూటమి నేతలు పిన్నయ్యదొర, ఎం.రామారావు, బాలయ్యదొర, క్రిష్ణమూర్తి, లక్ష్మణ్‌రావు, భీమన్న, బాబురావు, కొండలరావు, నితిన్‌కుమార్, పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది సంబరాలు జరిపారు. జ్ఞానేశ్వరి కేక్ కట్ చేయగా నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను రూ.4 వేలు చేసిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామిని ప్రాధాన్య క్రమంలో నెరవేర్చుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో గ్రామాలకు తారు రోడ్డు సదుపాయం కల్పనకు రూ.వెయ్యి కోట్లతో అడవితల్లికి బాట కార్యక్రమం చేపట్టారన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గతంలో లేని విధంగా జిల్లాలో 35వేల పక్కా గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఏడాది కూటమి పాలనపై గిరిజన ప్రజలు సంతృప్తికి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, నాయకులు శెట్టి నాగేశ్వరరావు, దేపూరి వెంగళయ్య, వల్లి, మంగు, అప్పారావు, కృష్ణవేణి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరడా వీరబాబు పాల్గొన్నారు.



కూటమి ఏడాది పాలన పురస్కరించుకుని కేక్ కట్ చేస్తున్న జ్ఞానేశ్వరి, టీడీపీ నాయకులు

కొయ్యూరు జీటీడబ్ల్యూఏ- 1 హెచ్‌ఎంగా శ్రీనివాసరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

కొయ్యూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల- 1 ప్రధానోపాధ్యాయుడిగా చింతల శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసినహెచ్‌ఎం ఎస్‌వీఎన్ మూర్తి హుకుంపేట మండలం ఉప్ప బాలికల ఆశ్రమ పాఠశాలకు బదిలీపై వెళ్లారు.అక్కడ నుంచి శ్రీనివాసరావు కొయ్యూరు వచ్చారు. ఈమేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు.

సామూహిక అక్షరాభ్యాసాలు



రావణాపల్లి కనకదుర్గ ఆలయంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కొయ్యూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు పాఠశాలల్లో ప్రవేశాలకు శుభసూచకంగా వారికి అక్షరాభ్యాసం చేయించాలని ధార్మిక సంస్థల సేవ ప్రతినిధి డీవీడీ ప్రసాద్ సూచించారు. గురువారం దానధర్మ చారిటబుల్ సంస్థల ఆధ్వర్యంలో రావణాపల్లి కనకదుర్గ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలను వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సంస్థల సేవా ప్రతినిధులు పద్మరాజు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐకు పూర్వ వైభవం తీసుకురావాలి'



మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలినేని

కొయ్యూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సీపీఐకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలినేని వెంకటరమణ, పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ పిలుపునిచ్చారు. పార్టీ 20వ మండల మహా సభలను గురువారం మండలంలోని రావణాపల్లిలో మండల కార్యదర్శి ఇరవాడ దేముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఈ ప్రాంతీయుల సమస్యలపై పోరాటాలు జరిపి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొడ్డేటి దేముడు రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి పార్టీకు వన్నె తెచ్చారన్నారు.ఇదే స్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు.

మండల కార్యదర్శిగా ఉల్లి సూరిబాబు

ఈ సభల్లో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్టీ సీనియర్ నాయకుడు ఉల్లి సూరిబాబును మండల కార్యదర్శిగా, 13 మందితో కూడిన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేత ఉల్లి సత్యనారాయణ, రైతు సంఘ నేత శివలంక కొండలరావు, రంప చోడవరం డివిజన్ కార్యదర్శి జుత్తు కుమార్, గొలుగొండ మండల కార్యదర్శి రాధాకృష్ణ, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు భవాని, రావణాపల్లి ఎంపీటీసీ సత్యవాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్య

- ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి



చింతపల్లిలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న టీడబ్ల్యూవో

చింతపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఏటీడబ్ల్యూవో బి. జయనాగలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో ఏటీడబ్ల్యూవో అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యమైన పోషకాహారం పిల్లలకు అందించడంతోపాటూ ఆటాపాటలతో పూర్వ ప్రాథమిక విద్యాబోధన జరుగుతుందన్నారు. నర్సరీ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం వల్ల పాఠశాల వాతావరణం అలవాటుపడుతుందన్నారు. ప్రాథమిక విద్యకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పునాది పడుతుందన్నారు. ఇక్కడే ఒత్తిడిలేని నాణ్యమైన విద్య చేరువవుతుందని చెప్పారు. పిల్లలందరికీ విద్యా కిట్లు, మధ్యాహ్న భోజనం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మూడోవ తరగతి నుంచి పదో తరగతి వరకు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వసతి, విద్యాబోధన సదుపాయం ఉన్నదన్నారు. ఏసీడీపీవో రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, వరలక్ష్మి, రాశి పాల్గొన్నారు.

జి.మాడుగులలో 35.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు

పాడేరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వాతావరణంలోని మార్పులతో మన్యంలో గరిష్ఠ ఉ ష్ణోగ్రతల్లో గురువారం స్వల్పమార్పులు కనిపించాయి. జి.మాడుగుల, కొయ్యూరు మినహా ప్రాంతాల్లో 30 డిగ్రీల సెల్సియస్‌లోపు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం జి.మాడుగులలో అత్యధికంగా 35.3 డిగ్రీలు సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, కొయ్యూరులో 30.5, చింతపల్లిలో 29.3, పాడేరులో 28.1, హుకుంపేటలో 27.3, అనంతగిరిలో 26.8, డుంబ్రిగుడలో 26.3, పెదబయలులో 26.1, జీకేవీధిలో 26.0 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు



డేగ్రాయిపుట్టు గ్రామ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

పెదబయలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండ పరిధి గోమంగి పంచాయతీ పరిధిలో డేగ్రాయిపుట్టు గ్రామానికి, వంతెన నిర్మాణానికి గురువారం ఎంపీపీ వరహాలమ్మ, జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి పరిపాలన విభాగం నుంచి విడుదలైన రూ. 65లక్షలతో ఈ నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. కొండ శిఖర గ్రామాలకు రోడ్డు నిర్మించడంపై పలువురు గిరిజనులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు భాస్కరరావు, బాలరాజు, పద్మనాభం వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, గొమంగి పంచాయతీ సరియపల్లి మావేలమ్మ గుడి నుంచి సరియపల్లి కూడలి వరకు అరకు ఎంపీ నిధులు రూ. 24 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎంపీపీ బొంజుబాబు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తిబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డిపోల్లో రేషన్ పంపిణీతో ఇక్కట్లు: మానవ హక్కుల ఫోరం

పాడేరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న డిపోల్లో రేషన్ పంపిణీ ప్రక్రియతో గిరిజనులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని మానవ హక్కుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేశ్, తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎండీయూ వాహనాల్లో గ్రామాల్లోని గిరిజనులకు ఇంటింటికీ రేషన్ పంపిణీ జరిగేదని, కానీ వాటిని రద్దు చేసి డిపోల్లో మాత్రమే రేషన్ సరుకులందిస్తుండడంతో డిపోలకు దూరంగా ఉన్న గ్రామాల గిరిజనులు వాటిని విడిపించుకునేందుకు పదుల కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈక్రమంలో పలువురు గిరిజనులు రేషన్ పొందలేని దుస్థితి నెలకొంటుందని, ఈక్రమంలో పౌరసరఫరాల వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రతి గిరిజనుడికి ఇంటికే అవకతవకలు లేకుండా రేషన్ అందేలా పాలకులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి

- డీఆర్‌వో పద్మలత

పాడేరురూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మలత సూచించారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో గురువారం పాడేరులోని సుండ్రుపుట్టు ఎంపీపీ పాఠశాలల్లో ఫైన్ క్వాలిటీ ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీని ప్రారంభించారు. విద్యార్థులు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ సన్నబియ్యం సరఫరా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్డేమీల్ అసిస్టెంట్ డైరెక్టర్ పట్నాయక్, ఎంఈవో - 2 చీపురు సరస్వతీదేవి, రెవెన్యూ అధికారులు, జీసీసీ బ్రాంచి మేనేజర్, మిడ్డేమీల్ కో-ఆర్డినేటర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సుండ్రుపుట్టు ఎంపీపీ పాఠశాలలో బియ్యంను పరిశీలిస్తున్న డీఆర్‌వో

మండలంలో తొలిరోజు 70 శాతం విద్యార్థులు హాజరు....

మండలంలో ఉన్న 161 పాఠశాలలో పాఠశాలల పునఃప్రారంభం రోజు 70 శాతం మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరైనట్టు ఎంఈవో- 2 సీహెచ్.సరస్వతీదేవి తెలిపారు.

చింతపల్లిలో..

చింతపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నట్టు స్థానిక ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు అన్నారు. గురువారం నక్కమెట్ట, బెన్నవరం, పొలంబంద పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెట్టేందుకు సన్న బియ్యం సరఫరా చేసిందన్నారు. పాఠశాల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు వడ్డించినట్టు చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పక్కాగా అమలు చేయాలని ఎంఈవో-2 ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను ఈ సందర్భంగా ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తొలి రోజే పాఠ్య, నోట్ పుస్తకాలను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు.



చింతపల్లి: భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈవో బోడం నాయుడు

పాఠ్యపుస్తకాలు పంపిణీ

అరకులోయ: మండలంలోని వసతిగృహాలు, ఆశ్రమోన్నత పాఠశాలలకు విద్యార్థులు తొలిరోజు మోస్తరుగా హాజరయ్యారు. పాఠశాలల్లో మధ్యాహ్నబోజన పథకంలో సన్నబియ్యంతో భోజనాలు అందిస్తున్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అరకులోయ సీఏహెచ్ స్కూల్‌లో వసతిగృహాలకు చేరిన విద్యార్థులందరికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను హెచ్‌ఎం ఎల్‌బీ దయానిధి పంపిణీ చేశారు. తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలలకు సత్వరం పంపాలన్నారు. అరకులోయ సీఏహెచ్ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులకుగాను మొదటి రోజు 120 మంది హాజరయ్యారన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపణీ చేస్తున్న ఉపాధ్యాయులు

రక్తదాన శిబిరాలకు ఉద్యోగులు సహకరించాలి: డీఆర్‌వో



రక్తదాన శిబిరంలో పాల్గొన్న డీఆర్‌వో, డీఎంహెచ్‌వో తదితరులు

పాడేరురూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలు విజయవంతానికి వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, యువకులు ముందుకు రావాలని డీఆర్‌వో పద్మలత కోరారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కాఫీహౌస్‌లో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ విస్తృత సేవలు అందిస్తూ రక్తపు నిలువలు పెంచేందుకు విశేష కృషి చేస్తోందన్నారు. అన్ని శాఖల అధికారులు వీరికి ప్రోత్సాహం అందించాలని ఆమె కోరారు. పశు సంవర్ధక శాఖ అధికారులు డాక్టర్. నర్సింహులు, డాక్టర్. షేక్ ఎండీషరీఫ్ చొరవతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 21 యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా రక్తదాతలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.రామవేంద్ర, సొసైటీ వైస్‌ఛైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి జి.గౌరీశంకరరావు, కోశాధికారి పి.సూర్యారావు, సభ్యులు టి.ప్రసాద్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, రవి, కో-ఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శివ ప్రసాద్

చింతపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోరుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శివ ప్రసాద్ అన్నారు. గురువారం తమ్మంగుల గ్రామ పంచాయతీ కేంద్రంలో లోతుగెడ్డ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో 169మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పది మంది జ్వరబాధితులకు రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎపిడమిక్ సీజన్ ప్రారంభం కావడంతో గ్రామాల్లో జ్వరాలు, అతిసార ప్రబలే అవకాశం ఉందన్నారు. గిరిజనులకు వ్యాధి సోకిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. గిరిజనులు నాటు వైద్యం, పసర మందులకు దూరంగా ఉండాలన్నారు. జ్వర బాధితులు విధిగా రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. మలేరియా నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నా రు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో బాలయ్య, ఎంఎల్‌హెచ్‌పీ అన్సార, క్షయ పర్యవేక్షకుడు ప్రసాద్, ఏఎన్‌ఎం ప్రశాంతి పాల్గొన్నారు.

గ్రామాలకు రహదారులు నిర్మించాలి: పెసా కమిటీ



మండల పెసా కమిటీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

జి.మాడుగుల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదలోచలి పంచాయతీ గుతత్రలబంధ, వలసపాడు గ్రామాలకు కనీస సౌకర్యాలు కల్పించాలని పెసా కమిటీ మండల ఫోరం అధ్యక్షుడు లకే రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆ గ్రామాలను సందర్శించారు. ప్రధానంగా రహదారి సదుపాయం లేకపోవడంతో పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను చేపట్టలేద న్నారు. అలాగే, గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల సదుపాయాలు లే వని చెప్పారు. అధికారులు స్పందించి ఈ గ్రామాల్లో సందర్శించాలని రామకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ నేతలు ఎస్. బాలకృష్ణ, బి.సూరిపడాల్, ఎం.చంద్రమోహన్, వి.సన్యాసిరావు, భాస్కర్‌రావు దేముళ్ల, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీ ట్రస్టుపై చర్యలు చేపట్టాలి'

జి.మాడుగుల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ట్రస్టు మోసాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీసీవై పార్టీ పాడేరు ఇన్‌చార్జి కిలో రాజన్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ట్రస్ట్ పేరుతో అనేక మాయమాటల తో తమ భూములు విక్రయించి సొమ్ము జమ చేసినట్టు మద్దిగరువు ప్రాంతానికి చెందిన పలువురు కలిసి తమకు గోడు వివరించినట్టు ఆయన చెప్పారు. ఈ ట్రస్ట్ ఊబిలో వేలాది గిరిజన కుటుంబాలు బలైపోయారన్నారు. ఈ మోసాలు బయటపడి రోజుల గడుస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం బా ధాకరమని రాజన్ పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చొరవ తీసుకుని బాధిత గిరిజన కుటుంబాలను న్యాయం చే యాలని విజ్ఞప్తి చేశారు.

ఏబీవీపీ గిరిజన విద్యార్థి విభాగం కన్వీనర్‌గా మహేశ్



రాష్ట్ర విభాగం కార్యదర్శిగా ఎంపికైన మహేశ్

పెదబయలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 9 నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఏబీవీపీ ప్రాంత అభ్యాస వర్గంలో గిరిజన విద్యార్థి విభాగ రాష్ట్ర కన్వీనర్‌గా పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ లకేపుట్టు గ్రామానికి చెందిన అల్లంగి మహేశ్ ఎంపికయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆదేశాలు జారీ చేశారు.

పీవీటీజీ గ్రామాల్లో సదుపాయాల కల్పనకు గ్రామ సభలు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పీవీటీజీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పీఎం జుగా కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 20తేదీ వరకు పీవీటీజీ గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి, గిరిజనులకు కనీస సదుపాయాలు, అవసరమైన మౌలిక వసతుల నివేదిక రూపొందిస్తామన్నారు. ప్రధానంగా పీవీటీజీలకు పక్కా గృహాలు, రేషన్, ఆధార్, ఉపాధి జాబ్ కార్డులు, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు అంశాలపై సూక్ష్మ స్థాయిలో సర్వే చేపడతామన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు, ఆధార్, ఉపాధి కార్డుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గ్యాస్ కనెక్షన్లు, విద్యుత్, పాఠశాల, పోషణ అభియాన్ అందించనున్నామన్నారు. సికెల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహిస్తామన్నారు.ఈకార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం



పాల డబ్బా పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యురాలు

పెదబయలు,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి సీతగుంట పంచాయతీ రోగుల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి దాతలు సాయమందించారు. గ్రామానికి చెందిన వెచ్చంగి. కమలమ్మ, విజయరాజు దంపతులకు ఇటీవల ఒకే కాన్పులో ముగ్గురు ఆడ పిల్లలు జన్మించారు. ఈ శిశువులకు పాలు కోసం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం యూనిటీ ఫర్ చారిటీ ట్రస్ట్ ద్వారా రెండేళ్ల పాటు ఆ శిశువులకు పాల డబ్బాలు అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ కార్యక్రమంలో గిరిజన సం ఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, ట్రస్ట్ సభ్యురాలు శ్రీమతి జోష్ విన్ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్న పడాల్, బోండా సన్నిబాబు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు

» జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారిణి కె.పద్మావతి


తాగునీటి సరఫరా పథకాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారిణి పద్మావతి

నర్సీపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు అందించడానికి చర్యలు తీసుకున్నామని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారిణి కె.పద్మావతి తెలిపారు. గురువారం నర్సీపట్నం ఆర్టీసీ బస్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో ఇక్కడ మెరుగైన సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఆరు ఫ్యాన్లు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెచ్చామని, మరో ఐదు కొత్తవి అమర్చామని తెలిపారు. మరుగుదొడ్లకు తలుపులు అమర్చామని, మొక్కల కుండీలలో కొత్తగా మొక్కలు నాటించామని చెప్పారు. ఆర్వో ప్లాంట్ యూనిట్‌కు మరమ్మతులు చేయించామన్నారు. బస్సులను కచ్చితమైన టైమింగ్స్‌లో తిప్పడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. జీపీఎస్ ట్రాకింగ్‌తో పరిశీలిస్తున్నట్టు చెప్పారు. వారంలో ఒక రోజు తిరిగే వాడపల్లి సర్వీసును డైలీ సర్వీసు కింద మార్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ధీరజ్ పాల్గొన్నారు.

యోగా పోటీల్లో చోడవరం విద్యార్థినులకు పతకాలు


జిల్లా స్థాయి యోగా విజేతలను అభినందిస్తున్న యోగా గురువు సతీశ్

చోడవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా ఈ నెల 11న అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో స్థానిక పతంజలి యోగ కేంద్రం విద్యార్థినులు మళ్ల శ్రీహిత ప్రథమ స్థానం, పందిరి వెన్నెలశ్రీ ద్వితీయ స్థానం సాధించారు. వీరిని యోగా గురువు పుల్లేటి సతీశ్ గురువారం అభినందించారు.

ఘనంగా అప్పికొండమ్మ పండుగ


అప్పికొండమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గొలుగొండ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో అప్పికొండమ్మ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీశారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని వసతులు కల్పించారు.

మోస్తరు వర్షం


మాడుగులలో వర్షం

మాడుగుల/మాడుగుల రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ మాదిరిగా ఎండ కాసింది. ఎండ తీవ్రత లేకపోయినా ఉక్కపోత మాత్రం యథావిధిగా ఉంది. అయితే సాయంత్రం ఐదు గంటలకు వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై తేలికపాటి జల్లులు ఆరంభమై మోస్తరు వర్షం పడింది. వాతావరణం చల్లబడడంతో ఉక్కపోత నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

నర్సీపట్నం జనసేన సమన్వయకర్త ఏకపక్ష నిర్ణయాలు

» ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడి ఆరోపణ

కృష్ణాదేవిపేట , జూన్ 12(ఆంధ్రజ్యోతి) : మండలంలో జనసేన ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్లను నర్సీపట్నం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త రాజాన వీర సూర్యచంద్ర పట్టించుకోవడం లేదని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు, లింగంపేట గ్రామ ఉపసర్పంచ్ లంక సత్యానారాయణ ఆరోపించారు. లింగపేట గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీర సూర్యచంద్ర ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తమ పంచాయతీలోని పలువురిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల పార్టీకి నష్టం వస్తుందని చెప్పారు.

బీజేపీలో మల్లాం గ్రామ యువకుల చేరిక


ఎంపీ సీఎం రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరిన మల్లాం గ్రామ యువకులు

బుచ్చెయ్యపేట జూన్12 (ఆంధ్రజ్యోతి) మల్లాం గ్రామానికి చెందిన సుమారు 50 మంది యువకులు అనకాపల్లిలో ఎంపీ సీఎం రమేశ్ సమక్షంలో గురువారం బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఈర్లె శ్రీరామమూర్తి, జిల్లా కార్యదర్శి దూది రాజేశ్, నియోజకవర్గ కన్వీనర్ కందర్ప రమణమూర్తి, సీతా నాగరాజు, గొలగాని కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ కర్రిశంకరరావు తెలిపారు. ముషిడిపల్లి, ఏ.కొత్తపల్లి, కేఎంపాలెం, యండపల్లి పాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

చీడికాడ ఈవోపీఆర్‌డీగా చంద్రశేఖర్


ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

చీడికాడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): చీడికాడ మండల పరిషత్ ఈవోపీఆర్‌డీగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. పాయకరావుపేట నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఇక్కడి ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు పెందుర్తికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు కొత్త ఈవోపీఆర్‌డీని సన్మానించారు.

ఘనంగా పశువుల పండుగ

చీడికాడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చీడికాడలో గురువారం పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది వరి ఆకులు వేసే ముందు భక్తిశ్రద్ధలతో ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు యర్రా అప్పారావు, గాలి బాలకృష్ణ, వరహామూర్తి, జగ్గిబాబు తదితరులు అమ్మవారిని డప్పులతో ఊరేగింపుగా గ్రామానికి దూరంగా ఉన్న ఆలయం వద్దకు పశువులతో వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు.

తొలి రోజు హాజరు అంతంత మాత్రమే...

» మండలంలో 54 ప్రభుత్వ పాఠశాలలు
» 9,447 మంది విద్యార్థులకు 4,509 మంది హాజరు
» పెదబొడ్డేపల్లి ఏపీఆర్ఎస్‌లో సున్నా హాజరు
» పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన హెచ్‌ఎంలు


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తురకబడి)లో సగం వరకు ఖాళీగా ఉన్న బెంచీలు

నర్సీపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిసి... ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్నా సగానికి పైగా విద్యార్థులు మొహం చాటేశారు. దీని వలన తొలి రోజు విద్యార్థులు హాజరు లేకపోవడంతో పాఠశాలన్నీ బోసిపోయాయి. తరగతి గదులు ఖాళీగా దర్శనమిచ్చాయి. పెదబొడ్డేపల్లి ఏపీ రెసిడెన్సియల్ స్కూల్లో 318 మంది విద్యార్థులకు ఒక్కరు కూడా హాజరు కాలేదు. పెదబొడ్డేపల్లి జడ్పీహెచ్ స్కూల్ 556 మందికి 75 మంది హాజరయ్యారు. వేములపూడి జడ్పీహెచ్‌ఎస్(బాలికలు) 410 మందికి 41, నర్సీపట్నం జడ్పీహెచ్‌ఎస్(తురకబడి) 157 మందికి 25, జడ్పీహెచ్‌ఎస్ బాలికలు 428 మందికి 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. వేములపూడి పీబీఎం జడ్పీహెచ్‌ఎస్‌లో 278 మంది 21 మంది, మోడల్ స్కూల్‌లో 348 మందికి 91, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 196 మంది హాజరుకావల్సి ఉండగా 11 మంది హాజరయ్యారు. గురందొరపాలెం ఎంపీపీ స్కూల్లో 73 మంది విద్యార్థులకు ఆరుగురు హాజరయ్యారు. నర్సీపట్నం మండలంలో 54 ప్రభుత్వ పాఠశాలలో 9,447 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4,509 మంది మాత్రమే హాజరయ్యారు. 4938 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

ప్రభుత్వ పాఠశాలకు హాజరైన విద్యార్థుల వరకు పాఠ్య పుస్తకాలు, నోట్స్ పంపిణీ చేశారు. స్కూల్ బ్యాగులు, బూట్లు, ఏకరీతి దుస్తులు త్వరలో పంపిణీ చేస్తారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: మండలంలోని పాఠశాలల్లో గురువారం సందడి నెలకొంది. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా విద్యాలయాలకు వచ్చారు. అయితే తొలి రోజు హాజరు అంతంతమాత్రంగానే ఉంది. పాఠశాలలకు 50 శాతం వరకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు చేరాయి. వాటిని ఈ నెల 20 నుంచి పంపిణీ చేయనున్నట్టు ఎంఈవో-2 వి.ఉషారాణి గురువారం విలేకరులకు తెలిపారు. బూట్లు, సాక్సులు, బ్యాగులు ఇంకా రావలసి ఉందన్నారు. మండలంలోని 56 పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు 2,491 మంది విద్యార్థినీ, విద్యార్థులున్నారన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన

» కూటమి పాలన ఏడాది సంబరాల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


చోడవరంలోని పార్టీ కార్యాలయంలో సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయవంతంగా సాగడం ఆనందంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి కార్యకర్తలకు నాయకులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, సకురు కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, ఏడువాక లక్ష్మణకుమార్, ఎలకా మల్లిబాబు, కొట్నాపు చిన్న, ముడుసు గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో..

రావికమతం: ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ దశల వారీగా నేరవేరుస్తున్నామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా రావికమతం గంజివారి దేవాలయంలో కార్యకర్తలు, అభిమానులు, నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే రాజు గురువారం కేక్ కట్ చేసి విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తన అనుభవంతో ఆర్థిక లోటును భర్తీ చేస్తూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, జనసేన మండల అధ్యక్షుడు ఘైచర్ల నాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా బుచ్చెయ్యపేటలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వడ్డాది నుంచి చోడవరం, రావికమతం నుంచి వడ్డాది వరకు రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, తమరాన దాసు, డొంకిన అప్పలనాయుడు, సర్పంచ్ సుంకర లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. గురువారం మండలంలోని రోలుగుంట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏడాది పాలన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, బంటు రాజు, కోలిపల్లి ఈశ్వరరావు, బోడాపాత్రుని నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు


చోడవరం జనసేన కార్యాలయంలో సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మేలి కలయికతో తొలి ఏడాదిలోనే రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందించారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అన్నారు. గురువారం కూటమి ఏడాది పాలనపై జనసేన కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో రాష్ట్రాన్ని ప్రగతిపథం వైపు నడిపిస్తుండడంతో రానున్న నాలుగేళ్లలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందన్నారు. శాంతిభద్రతల పరంగా, సూపర్‌సిక్స్ పథకాల అమలుతో ప్రజల ఆదరణ చూరగొనడం ఆనందం కలిగిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు సిరిపురపు రమేశ్, జిల్లా కార్యదర్శి అల్లం రామప్పారావు, గూనూరు మూలినాయుడు, ఘైచర్ల నాయుడు, కర్రి రమేశ్, బలిజ మహరాజు, తుమ్మపాల రమేశ్, దాడి సూరినాగేశ్వరరావు, కర్రి తమ్మునాయుడు, దాడి పెద గోవింద్, దొరబాబు, శివశంకర్, నరవ సరోజిని, నరేశ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో ఎన్నో అభివృద్ధి పనులు

మాడుగుల: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని వ్యవసాయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా మాడుగుల దేవి ఆడిటోరియంలో గురువారం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, పట్టణ అధ్యక్షుడు వడ్డాది రంజిత్ వర్మ, పుప్పాల రమేశ్, నందారపు సన్యాసిరావు, లెక్కల కాశిబాబు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా చీడికాడలో టీడీపీ ఆధ్వర్యంలో గురువారం విజయోత్సవ సభ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, టీడీపీ మండల నాయకులు పోతల రమణమ్మ, గండి ముసలినాయుడు, పంచాడ దాలెంనాయుడు, శరగడం శివ, ఎంపీటీసీ సభ్యుడు బీళ్ల కోటేశ్వరరావు, దారపు పెద్దినాయుడు, పైల ముత్యాలనాయుడు, గండి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైవాడ అతిథి గృహం వద్ద..

దేవరాపల్లి: కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పరుగులు తీస్తున్నదని టీడీపీ నాయకులు అన్నారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద కూటమి కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, జనసేన మండల అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, దొగ్గ దేమున్నాయుడు, సత్యారావు, పెంటకోట అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో గిరిజన మహిళల నిరసన

» తాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కొట్నాబిల్లి గిరిజన మహిళలు

రావికమతం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయలు వెచ్చించి రక్షిత మంచినీటి పథకం నిర్మించినా గుక్కెడు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదంటూ పాత కొట్నాబిల్లి గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో గురువారం నిరసన తెలిపారు. సీపీఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కె.గోవిందరావు, పాడి బెన్నయ్యలు మాట్లాడుతూ మండలంలోని టి.అర్జాపురం పంచాయతీ శివారు పాత కొట్నాబిల్లి గ్రామంలో 289 మంది జనాభా ఉన్నారన్నారు. ఈ గ్రామంలో సుమారు 30 ఏళ్ల క్రితం పదివేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారన్నారు. ఈ పథకం శిథిలావస్థకు చేరడంతో జల్ జీవన్ పథకంలో రూ.16.9 లక్షలతో గ్రామ శివారులో కొండ వద్ద 20 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం నిర్మించి, ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేశారన్నారు. అయితే అధికారులు రక్షిత పథకానికి అనుసంధానంగా బోరు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పథకం ద్వారా గ్రామస్థులకు తాగునీరు అందడం లేదని వారు తెలిపారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భగవంతరావును సంప్రతించగా అప్పట్లో జల్ జీవన్ పథకంలో రక్షిత మంచినీటి పథకం, ఇంటింటికి కొళాయిలకు నిధులు మంజూరయ్యాయన్నారు. పథకం నిర్మాణం పూర్తయినందున పాత రక్షిత పథకం బోరుబావికి మోటారు ఏర్పాటు చేసేందుకు గ్రామ పంచాయతీతో మాట్లాడామన్నారు. త్వరలోనే పథకాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

సామూహిక అక్షరాభ్యాసాలు


నాతవరంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో గౌరీ

నాతవరం. జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు టీచర్లు ఆట పాటలతో విద్యా బోధన చేయాలని గొలుగొండ సీడీపీఓ గౌరీ సూచించారు. గురువారం మండలకేంద్రం నాతవరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కె.అప్పలనర్స మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్, పారుపల్లి కొండబాబు, టీడీపీ నేతలు పైల సూరిబాబు, శెట్టి నానాజీ, డాక్టర్ ప్రసన్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగజ్యోతి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.రాజేశ్వరి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ: మండలంలోని పలు గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. గొలుగొండ, ఏఎల్ పురం, చీడిగుమ్మల గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ర్యాలీలు నిర్వహించారు.

ఎట్టకేలకు కాలువకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కాలువ వద్ద పనులు చేపడుతున్న దృశ్యం

దేవరాపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైవాడ జలాశయం నుంచి విశాఖ నగర పాలక సంస్థకు మంచినీరు సరఫరా చేసే కాలువకు ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ నెల ఏడో తేదీన 'కష్టం పోయింది.. నష్టం మిగిలింది' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో జీవీఎంసీ అధికారులు స్పందించారు. గతంలో రైవాడ జలాశయం నుంచి జీవీఎంసీకి మంచినీరు సరఫరా చేసే కాలువకు మరమ్మతులు పేరుతో 0.350 కిలోమీటరు వద్ద తూమును మూసేశారు. దీని వల్ల పొలాల్లో చేరిన అదనపు నీరు వెళ్లే దారి లేక కాలువకు ఎడమ గట్టు వైపు పొలాలు మునిగిపోయి రైతులు నష్టపోయారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో జీవీఎంసీ అధికారులు కాలువ వద్ద పనులు చేపట్టారు. పూడ్చిన మదుమును తెరిపించి అక్కడ పాత తూము స్థానంలో కొత్త తూమును అమర్చి యథావిధిగా పొలాల్లో చేరే అదనపు నీరు పోయే మార్గాన్ని పునరుద్ధరించామని జీవీఎంసీ ఏఈఈ మోహన్, సూపర్‌వైజర్ పోలినాయుడు గురువారం తెలిపారు. కాగా తమ సమస్యకు పరిష్కారం చూపినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సబ్ ట్రెజరీ అధికారి గణేశ్‌కి సన్మానం


ఏటీవో గణేశ్‌ను సన్మానిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎస్టీవోగా ఆరేళ్లు పని చేసి పాడేరుకు బదిలీ అయిన సీహెచ్ఎస్ఈ గణేశ్‌ను ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. గురువారం నర్సీపట్నం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వి.గజ్జాలమ్మ మాట్లాడుతూ ఎస్టీవో గణేశ్ ప్రభుత్వ పెన్షనర్స్‌కి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన స్థానంలో నర్సీపట్నం ఎస్టీవోగా బాధ్యతలు చేపట్టిన ఏబీఎస్ఎస్ఎన్ మూర్తికి అభినందనలు తెలుపుతూ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏటీవో బి.నాగేశ్వరరావు, కోటవురట్ల ఎస్టీవో రామారావు, పలువురు ప్రభుత్వ పెన్షనర్లు పాల్గొన్నారు.

మంచినీటి బావి సమస్యపై ఎమ్మెల్యేకు వినతి

బుచ్చెయ్యపేట, జూన్ 12 (ఆంధ్ర జ్యోతి): బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెం గ్రామంలో మంచినీటి బావి ఆక్రమణకు గురైందని, ఆక్రమణలు తొలగించి బావిని వినియోగంలోకి తేవాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును సర్పంచ్ సుంకర లక్ష్మి కోరారు. గురువారం బుచ్చెయ్యపేటలో నిర్వహించిన కూటమి ప్రభుత్వ ఏడాది సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేను ఆమె కలిసి వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల క్రితం నేతవానిపాలెంలో వైసీపీ నాయకుడు గొంపా చినబాబు మంచినీటి బావిని కప్పేసి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారని, ఆ బావిని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డొంకిన అప్పలనాయుడు, వియ్యపు రామారావు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాల సంఘాల కార్మికుల ఆందోళన

» కనీస వేతన చట్టాలు అమలు చేయాలంటూ మానవహారం


కొత్తూరు జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న పాల సంఘాల కార్మికులు

చోడవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ యాజమాన్యం కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. విశాఖ డెయిరీ యాజమాన్యంలో పాల కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యదర్శులు, హెల్పర్లకు కనీస వేతన చట్టం అమలు చేసి, న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని విశాఖ డెయిరీ పాల సంఘాల కార్యదర్శులు, హెల్పర్లు కొత్తూరు జంక్షన్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. అంతకు ముందు గాంధీగ్రామం పాల సంఘం నుంచి కొత్తూరు జంక్షన్ వరకూ ర్యాలీగా వచ్చిన సిబ్బంది కొత్తూరు జంక్షన్‌లో నిరసన అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి తహశీల్దార్ రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయకుండా వారి శ్రమను దోచుకుంటున్న డెయిరీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని, అలాగే డెయిరీలో అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఈఎస్ఐ పథకం అమలు చేయాలని కోరారు. విశాఖ డెయిరీపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించి పాలకవర్గంపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో గంగుపాము కనకారావు, దాడి రామారావు, బొడ్డేడ ప్రసాద్‌లతో పాటు పాల సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో హుండీ చోరీ

చీడికాడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చీడికాడలోని నూకాలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. బుధవారం అర్ధరాత్రి తరువాత దొంగలు దేవాలయం తలుపులు, హుండీ తాళాలను పగులగొట్టి సుమారు రూ.30 వేల వరకు నగదును అపహరించినట్టు ఆలయ కమిటీ సభ్యుడు పరవాడ మహేశ్ గురువారం విలేకరులకు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యంతో భోజనం

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికే నాణ్యమైన సన్నబియ్యాన్ని పాఠశాలలకు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. జిల్లాలో 1,418 ప్రభుత్వ పాఠశాలలు, 136 ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ వసతి గృహాలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రతి బస్తాపై క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి యోగా పోటీలు నేడు ముగింపు

పట్టణంలోని ఆర్ శంకరన్ ఫంక్షన్ హాలులో శుక్రవారం జరగనున్న జిల్లాస్థాయి ముగింపు యోగా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. యోగాంధ్ర- 2025 కార్యక్రమంలో భాగంగా చివరి రోజు యోగా పోటీలు శుక్రవారం జరగనున్నాయని పేర్కొన్నారు.

గోవాడ షుగర్స్ ఎండీగా వెంకటేశ్వరరావు

... 5వ పేజీ తరువాయి

ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ ఎండీగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. కాగా ఇప్పటి వరకూ గోవాడ ఎండీగా పనిచేసిన సన్యాసినాయుడు విజయనగరం జిల్లా భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ ఎండీగా ప్రభుత్వం బదిలీ చేసింది. వెంకటేశ్వర రావు గురువారం ఇక్కడ బాధ్యతలు చేపట్టగా, సన్యాసినాయుడు రిలీవ్ అయ్యారు.

'తల్లికి వందనం' ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

ఈ పథకాన్ని ప్రారంభిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లా విద్యా శాఖాధికారులు గతంలో ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా పంపిన వివరాల ప్రకారం జిల్లాలో 1,033 ప్రభుత్వ పాఠశాలల్లో రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు, జూనియర్ కళాశాలల్లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 93,555 మంది వున్నారు. ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ సెకండియర్ 98 వేల మంది వరకు చదువుతున్నారు. మొత్తం మీద 1,79,272 మంది విద్యార్థులు 'తల్లికి వందనం' పథకానికి అర్హులుగా గుర్తించారు. వీరికి సంబంధించి 1,19,357 మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు ఒకటి, రెండు రోజుల్లో డబ్బులు జమ కానున్నాయి. ఇక ఒకటో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు పూర్తయిన తరువాత వారిలో అర్హులైన విద్యార్థులకు ఈ పథకం కింద సాయం అందుతుంది. ఈ ఏడాది ఒకటో తరగతి, ఇంటర్ ప్రథమ సంత్సరంలో చేరే విద్యార్థులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వీరు గ్రామ/ వార్డు సచివాలయాల్లోని గృహ డేటా బేస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే శాశ్వత నివాసి అయి ఉండాలి. కుటుంబ ఆదాయం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పరిమితికి లోబడి ఉండాలి. పథకం ద్వారా లబ్ధి పొందాలనుకొనే తల్లులు ఆధార్ కార్డుతోపాటు పిల్లల ఆధార్ కార్డులు, నివాస ధ్రువీకరణ పత్రం లేదా ఓటరు కార్డు, రేషన్ కార్డు, వార్షిక ఆదాయం రుజువు చేసే పత్రం తీసుకెళ్లాల్సి ఉంటుంది. బ్యాంకు ఖాతా పుస్తకం, లేదా చెక్కు అందజేయాలి. తల్లులు తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకొని, బ్యాంకు ఖాతాతో లింకు అయిన ఫోన్ నంబరు యాక్టివ్‌గా ఉండేటట్టు చూసుకోవాలి. దరఖాస్తును సచివాలయంలో అందజేస్తే సంబంధిత విద్యా శాఖాధికారులు పరిశీలించి ధ్రువీకరించిన తరువాత తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

జీవనంలో యోగా భాగం కావాలి

» మానసిక ప్రశాంతత, రోగనిరోధక శక్తి
» హోం మంత్రి వంగలపూడి అనిత
» అచ్యుతాపురం సెజ్‌లో పది వేల మందితో యోగా
» హాజరైన ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు సుందరపు, బండారు, కలెక్టర్ విజయకృష్ణన్


యోగా చేస్తున్న మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు సుందరపు విజయ్‌కుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్ విజయకృష్ణన్

అచ్యుతాపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యోగా ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. యోగాంధ్ర- 2025 కార్యక్రమంలో గురువారం అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని ఏపీఐఐసీ వన్‌స్టాప్ సెంటర్ వద్ద భారీ ఎత్తున నిర్వహించారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఆయుష్ శాఖ సహకారంతో ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు పది వేల మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అనిత మాట్లాడుతూ, రోజూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత, శరీరంలో



మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

రోగనిరోధక శక్తి పెరుగుతాయని చెప్పారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలి రావాలన్నారు. యోగా గురువులు ఆర్.శ్రీను, బి.అప్పారావు వివిధ రకాల ఆసనాలు వేయించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసులు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఆయుష్ అధికారి కె.లావణ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, ఏపీఐఐసీ డీ జీఎం రాజశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్‌తోపాటు పెద్ద సంఖ్యలో స్థానికులు, సెజ్ కంపెనీల కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

కొత్తూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకర వాతావరణంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించాలని ఎంపీ సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. అనకాపల్లి పట్టణం వేల్పులవీధి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసి 'మన అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొని మూడు సంవత్సరాలు నిం డిన 52 మంది బాలబాలికలకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు తల్లిదండ్రులు ఆస్తిపాస్తులు ఇవ్వడానికి కాకుండా మంచి విద్యను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలకు ఉత్తమ విద్య అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి, సీడీపీవో పి.ప్రభావతి, 83వ వార్డు ఇన్‌చార్జి బొద్దపు ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు మంగా ఈశ్వరరావు, డీసీఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, కూటమి నాయకులు గొర్లి శేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీ సీఎం రమేశ్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

న్యాయవాదుల సందేహాల నివృత్తికి సదస్సులు దోహదం

» విశాఖ పోర్టు పోలియో జడ్జి జస్టిస్ రావు రఘునందన్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ రావు రఘునందన్‌రావు

సబ్బవరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సందేహాల నివృత్తికి రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్వహిస్తున్న న్యాయ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని న్యాయమూర్తి, విశాఖపట్నం పోర్టు పోలియో జడ్జి జస్టిస్ రావు రఘునందన్‌రావు తెలిపారు. అమరావతి బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) సంయుక్తంగా న్యాయవాదుల కోసం ఏర్పాటు చేసిన మూడు రోజుల న్యాయ సదస్సును డీఎస్ఎన్ఎల్‌యూలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి న్యాయ సదస్సులు నిర్వహించడం వలన న్యాయవాదుల సందేహాలను నివృత్తి చేసుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఈ సదస్సు వలన న్యాయవాదుల వృత్తి నైపుణ్యం పెంచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, డీఎస్ఎన్ఎల్‌యూ ఉప కులపతి డి.సూర్యప్రకాశరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సిరిపురపు కృష్ణమోహన్, ఏపీ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ ఆలూరి రామిరెడ్డి, ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కలిగినీడి చిదంబరం, రాష్ట్ర బార్ కౌన్సిల్ విశాఖపట్నం సభ్యులు పి.నర్సింగరావు, కీర్తి రామజోగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. విశ్రాంత న్యాయమూర్తులు ఆకుల వెంకట శేషసాయి, ఎం. సీతారామమూర్తి, ప్రస్తుత హైకోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తి పాల్గొని న్యాయవాదుల సందేహాలను నివృత్తి చేశారు.

క్యూఆర్ కోడ్ ద్వారా సమస్యలు చెప్పొచ్చు

» ఆర్టీసీ డీపీటీవో పద్మావతి


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ వద్ద డీపీటీవో, డీఎం

అనకాపల్లి టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులు సమస్యలు ఏమైనా ఉంటే కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా నేరుగా తెలియపరచవచ్చునని ఆర్టీసీ డీపీటీవో కె.పద్మావతి తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె కాంప్లెక్స్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అందువల్ల ప్రయాణికులు ఈ క్యూఆర్ కోడ్‌ను సేవ్ చేసుకొని సమస్యలు ఏమైనా ఉంటే తెలియపరచాలన్నారు. బస్సుల వేళల బోర్డులు కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలన్నీ బాగు చేశామన్నారు. డస్ట్‌బిన్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. దుకాణాల్లోని ఎంఆర్‌పీ ధరల బోర్డును ఏర్పాటు చేయించామన్నారు.

రేపటి నుంచి బస్‌పాస్‌ల జారీ

ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో బస్‌పాస్‌లను శనివారం నుంచి జారీ చేస్తామని పద్మావతి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ మార్పుల కారణంగా గురువారం నుంచి ఇవ్వాల్సిన బస్‌పాస్‌లను నిలిపివేశామన్నారు. సాఫ్ట్‌వేర్ ప్రక్రియ శుక్రవారానికి పూర్తవుతుందని శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి విద్యార్థులకు, జర్నలిస్టులకు పాస్‌లు అందజేస్తామన్నారు. శనివారం రెండో శనివారం కావడంతో మధ్యాహ్నం వరకే పాస్‌ల పంపిణీ ఉంటుందని తెలిపారు. ఈమె వెంట ఆర్టీసీ డీఎం ఎల్‌వీరావు, సిబ్బంది ఉన్నారు.

పోలీసుల అదుపులో బియ్యం లారీలు

... 5వ పేజీ తరువాయి

పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారు పి.సోమశేఖర్ వచ్చి, ఒక్కో లారీలో మూడు చొప్పున.. రెండు లారీల్లో నుంచి ఆరు బియ్యం శాంపిళ్లను సేకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతామని, ఇవి ఏ రకం బియ్యమో ల్యాబ్ నుంచి నివేదిక వస్తుందని చెప్పారు. దీని ఆధారంగా తదుపరి చర్యలు వుంటాయని ఆయన పేర్కొన్నారు. బియ్యం లారీలను పోలీసుల పర్యవేక్షణలో పెట్రోలు బంకు వద్దనే ఉంచారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. పూరి-యశ్వంత్‌పూర్-పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు (22883/22884) ఈ నెల 27 వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్, సంబల్‌పూర్-నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు (20809/20810) ఆగస్టు 1 వరకు థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాసు కోచ్, విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్‌కు (58506/58505) ఈ నెల 30 వరకు స్లీపర్ క్లాసు కోచ్, విశాఖ-బెంగళూరు-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08581/08582) ఈ నెల 30 వరకు థర్డ్ ఏసీ కోచ్, విశాఖ-తిరుపతి-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08547/08548) ఈ నెల 26 వరకు థర్డ్ ఏసీ కోచ్, విశాఖ-చర్లపల్లి-విశాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు (08579/08580) ఈ నెల 28 వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేయనున్నట్లు తెలిపారు.

ప్రధాని మోదీ సారథ్యంలో దేశానికి మరింత గుర్తింపు

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నాయన్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను రూ.600 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు ఎంపీ రమేశ్ చెప్పారు. అనకాపల్లి-రాజమహేంద్రవరం మధ్య ప్రస్తుతం వున్న నాలుగు లేన్ల జాతీయ రహదారిని ఆరు లేన్లకు విస్తరించడానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోవడానికి కేంద్రం ప్రభుత్వం రూ.11,500 కోట్లు సాయం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

గతంలో టీడీపీ అధికారంలో వున్న ఐదేళ్లలో అమరావతిలో కేంద్ర ప్రభుత్వ నిధులతో రహదారులు, అధికారుల నివాసగృహాల నిర్మాణ పనులు చేపట్టగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని జగన్ సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. ఈ కారణంగానే గత ఎన్నికల్లో వైసీపీకి, ఆ పార్టీ అధినేత జగన్‌కు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారన్నారు. అనకాపల్లి జిల్లాలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్, బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కానున్నాయని, భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్టులు, కంపెనీలు రానున్నాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదినేని యామిని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

మేడ పైనుంచి పడి వివాహిత మృతి


మంజుల (ఫైల్ ఫొటో)

మునగపాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మేడ పైనుంచి ప్రమాదవశాత్తూ కిందపడి వివాహిత మృతి చెందినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెంటకోట మంజుల అనే వివాహిత ఈ నెల 3వ తేదీన అమ్మమ్మ ఇంటికి చూచుకొండ వచ్చింది. ఈ నెల 11వ తేదీ రాత్రి సుమారు 10.30 గంటలు సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ మేడమీద ఉంది. ఫోన్‌లో మాట్లాడుతూ ప్రమాదవశాత్తూ కాలుజారి మేడ పైనుంచి కిందపడడంతో నడుము, తలపైన బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం తొలుత ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడి వైద్యులు సూచనల మేరకు మెరుగైన వైద్యం అంబులెన్స్‌లో విశాఖ తరలిస్తుండగా మార్గమధ్యంలో మంజుల మృతి చెందింది. ప్రమాద విషయం తెలుసుకున్న తండ్రి రాపేటి రాము గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కాగా మంజులకు భర్త, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

మునగపాకలో విషాదఛాయలు

» పరవాడ ఫార్మా పరిశ్రమలో విషవాయువులు పీల్చి కుమార్ మృతి
» పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబం కన్నీరుమున్నీరు


మృతుడు కుమార్ ఇంటి వద్ద విషాదంలో బంధువులు

మునగపాక, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పరవాడ ఫార్మాసిటీలోని సాయిశ్రేయాస్ ఫార్మాస్యూటికల్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో విషవాయువులు పీల్చడంతో శరగడం కుమార్ అనే కార్మికుడు మృతి చెందడంతో మునగపాకలో విషాదఛాయలు అలముకున్నాయి. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఇతని తండ్రి సుమారు ఏడేళ్ల క్రితం మృతి చెందారు. ఏడాదిన్నర క్రితం కుమార్ మునగపాక గ్రామానికి చెందిన మాధురిని వివాహం చేసుకున్నాడు. సుమారు నాలుగు నెలల క్రితం తల్లి కూడా తనువు చాలించింది. తల్లిదండ్రులు లేకపోవడంతో ఇతడే కుటుంబానికి పెద్ద దిక్కు అయ్యాడు. తమ్ముడు ఉద్యోగ రీత్యా విదేశాలకు వెళ్లడంతో కుమార్ పరవాడ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కర్మాగారంలో విషవాయువు పీల్చడంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పరవాడలోని ఫార్మా పరిశ్రమ వద్దకు, విశాఖ కేజీహెచ్‌కు తరలి వెళ్లారు. అన్న మరణ వార్త తెలుసుకున్న తమ్ముడు వంశీ విదేశం నుంచి బయలు దేరాడు. అతడు వచ్చే సమయాన్ని బట్టి కుమార్ అంత్యక్రియలు మునగపాకలో శుక్రవారం సాయంత్రం లేదా శనివారం జరగవచ్చునని అతని కుటుంబ సభ్యులు తెలిపారు.

కేంద్ర కారాగారంలో 35 మందికి స్థానచలనం

విశాఖపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారంలో విధులు నిర్వహిస్తున్న 35 మంది ఉద్యోగులకు బదిలీలు జరిగినట్లు సూపరింటెండెంట్ ఎం. మహేష్ తెలిపారు. 33 మంది వచ్చి తమ విధులలో చేరారని తెలిపారు. వీరిలో ముగ్గురు జైలర్లు, హెడ్ వార్డర్లు, సీనియర్ వార్డర్లు, వార్డర్లకు బదిలీలు జరిగినట్లు ఆయన తెలిపారు. మిగిలినవారు కూడా సోమవారం నాటికి విధుల్లో చేరతారని పేర్కొన్నారు.

ఫార్మాలో ప్రమాదాల పరంపర

... 5వ పేజీ తరువాయి

రాంకీ ఫార్మాసిటీలో వ్యర్థాల శుద్ధి కర్మాగారానికి పంపాలి. కానీ సాయి శ్రేయాస్ సిబ్బంది అలా చేయలేదు. ఆ వ్యర్థాలను నేరుగా ఈటీపీలోకి పంపించేశారు. అప్పటికే అందులో ఉన్న వ్యర్థాలతో కలిపి దానిని డైల్యూట్ చేసే ప్రక్రియ చేపట్టారు. ఆ సమయంలో ఈటీపీకి ఉన్న మ్యాన్‌హోల్స్‌ను మూసివేయాలి. కానీ తెరిచి ఉంచారు. అంటే నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఆ ప్రక్రియ జరుగుతున్నప్పుడు హెచ్2ఎస్ (హైడ్రోజన్ సల్ఫైడ్) విడుదలైంది. ఇది కుళ్లిన కోడిగుడ్డు వాసన వస్తుంది. దీనిని ఎక్కువ పీలిస్తే కోమాలోకి వెళ్లి, ప్రాణాలు కూడా పోతాయి. ఇక్కడ అదే జరిగింది. రాత్రి షిఫ్ట్‌లో ఉన్న సేఫ్టీ ఆఫీసర్లు ఇద్దరూ మరో వర్కర్ బన్సాల్‌ని తీసుకొని డైల్యూషన్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందో చూడడానికి ఈటీపీపైకి వెళ్లారు. అప్పటికే హెచ్2ఎస్ అక్కడ వ్యాపించి ఉండడంతో ఆ ఘాటైన వాయువు పీల్చి మరణించారు. వర్కర్ బన్సాల్ స్పృహ కోల్పోయాడు.

ఇవీ లోపాలు

- ఈటీపీ వద్దకు వెళుతున్నప్పుడు అక్కడ ఏ ప్రక్రియ జరుగుతున్నదో తెలుసు కాబట్టి దానికి తగిన రక్షణ పరికరాలు ధరించి వెళ్లాలి. అంటే మంచి మాస్క్ కచ్చితంగా ధరించాలి. అది విష వాయువుల నుంచి రక్షణ కల్పించేదై ఉండాలి.
- హెచ్2ఎస్‌ను వాసనను బట్టి గుర్తుపట్టవచ్చు. మ్యాన్‌హోల్ తెరిచి ఉంది కాబట్టి ఈటీపీ పైకి వెళుతున్నప్పుడే ఆ వాసన వస్తుంది. అంటే దానిని గుర్తు పట్టే స్థితితో సేఫ్టీ అధికారులు ఉండాలి. వారు ఆ వాసన గుర్తు పట్టి కిందికి దిగిపోవాలి. కానీ అలా చేసినట్టు లేదు.
- ప్రతి సంస్థ తయారుచేసే మందులను బట్టి 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)' పాటించాలి. మందుల తయారీ ప్రాంతంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సిబ్బందికి అవగాహన కల్పించి, తగిన భద్రతా పరికరాలు అందించాలి. అంటే మాస్కులు, గ్లౌజులు, బూట్లు వంటివి అందులో భాగంగా ఉంటాయి.

ఏదో జరిగింది చెప్పడం లేదు

కంపెనీ యాజమాన్యం, పోలీసులు విషవాయువు లీకై దానిని పీల్చి చనిపోయారని చెబుతున్నారు. ఇంకే విషయాలు వెల్లడించడం లేదు.

స్పందించని ఫ్యాక్టరీస్ విభాగం

ఈ ప్రమాదంపై వివరాలు తెలుసుకోవడానికి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి పరమేశ్వరరావుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత వారిదే. ఈ విభాగం పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో భద్రతా విభాగంలో పనిచేసే వారికి మళ్లీ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని అర్థమవుతోంది.

నిర్లక్ష్యం ఉందని అర్థమవుతోంది

- ముకుందరావు, ఈఈ, కాలుష్య నియంత్రణ మండలి

ఈటీపీలోనే వ్యర్థాలను శుద్ధి చేయకూడదు. వేరే ట్యాంకులోకి తీసుకొని చేయాలి. కానీ వారు అలా చేయలేదు. పైగా మ్యాన్‌హోల్ తెరిచి ఉంచారు. అది మూసి ఉంటేనే ప్రక్రియ సజావుగా జరుగుతుంది. అక్కడ నిబంధనల ప్రకారం వ్యవహరించలేదు. నిర్లక్ష్యం ఉందని అర్థమవుతోంది. పైగా చనిపోయిన వారిలో ఒకరికి సేఫ్టీ విభాగంలో పదేళ్ల అనుభవం ఉంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554